క్లుప్తంగా

ఘనంగా బోనాల వేడుకలు

పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని సీతారామ కోవెల సెంటర్‌లో ఉన్న పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన నిర్వాహకులు డీవీఆర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగ అధ్యక్షుడు ఊట్లపాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నులకపేటలో బీజేపీ పట్టణ సమావేశం



తాడేపల్లిరూరల్ : భారతీయ జనతా పార్టీ తాడేపల్లి పట్టణ కమిటీ సమావేశాన్ని నులకపేట శివచైతన్య తపోవనంలో ఆదివారం తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లూరు శివరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టొబాకో బోర్డ్ చైర్మన్ చిడిపోతుల యశ్వంత్, ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికయిన గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యులు టంకశాల ఈశ్వర్‌నాయుడును అభినందించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులు డి.వెంకట నాగ సురేష్‌కుమార్, గట్ల శివ కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శులు వల్లభాపురపు గిరినాగకృష్ణ, బత్తుల ఆంజనేయులు, కోశాధికారి రణజీత్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శివ శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

కాపర్ వైర్ చోరీ... నిలిచిన నీటి సరఫరా



తాడేపల్లిరూరల్: కాపర్ వైర్ దొంగలు విజృంభిస్తున్నారు. ఏకంగా ప్రజలకు తాగునీటిని అందించే విద్యుత్ మోటార్ కాపర్ వైర్లను దొంగిలిస్తున్నారు. దీంతో తాగునీరు సకాలంలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా తాడేపల్లి పరిధిలోని కొత్తూరు ఆంజనేయస్వామి గుడి సమీపంలో నగరపాలక సంస్థ ద్వారా ప్రజలకు తాగునీరు అందించే మోటార్ వైర్లను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. స్పందించిన ఎంటీఎంసీ అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేసే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైర్లను మోటారు అంచువరకు కట్ చేయడంతో జాయింట్ వేసేందుకు సిబ్బంది అవస్థలు పడ్డారు. ఇదే మోటారుకు గతంలో మూడు సార్లు వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించారు. ఇలా కత్తిరించిన వైర్లను ఓ ప్రదేశంలో మంటవేసి కాల్చి అందులో వచ్చే రాగి తీగను ఎత్తుకుపోతున్నారని స్థానికులు అంటున్నారు.

మహిళలకు చీరలు పంపిణీ



మంగళగిరి టౌన్: సీపీఐ సీనియర్ నాయకులు స్వర్గీయ వుడతా శ్యామసుందరరావు వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి పట్టణ పరిధిలోని ఇందిరానగర్‌లో ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, టీడీపీ నాయకులు వుడతా శ్రీనివాసరావు (బీరువాల శ్రీను) అండ్ బ్రదర్స్‌తో కలసి శ్యామసుందరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ సీపీఐ నాయకుడిగా ఇందిరానగర్ ఏర్పాటులో ప్రజల పక్షాన పోరాటం చేశారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు. తల్లిదండ్రులను స్మరిస్తూ వారి కుమారులు మహిళలకు చీరలు, అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, వివిధ పార్టీల నాయకులు అన్నం నాగబాబు, కంచర్ల కాశయ్య, గోసాల రాఘవ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే వ్యవసాయం ఎలా.. ?!

- నియంత్రించాల్సిన వాళ్లే నిర్లక్ష్యంగా ఉంటే ఎవరికి చెప్పాలి..
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



ఆంధ్రరత్న పంట కాలువలోకి మోటార్ల ద్వారా మురుగునీటిని వదులుతున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: సార్... పంట కాలువల్లో మలమూత్రాలు, వ్యర్థాలు, మురుగునీరు ప్రవహిస్తుంటే పంట పొలాల్లో ఏ విధంగా వ్యవసాయం చేయాలి..? తిండి గింజలు ఎలా అందించాలో చెప్పాలంటూ ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కింద సాగు చేసే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాలువలోకి పలు అపార్ట్‌మెంట్ల నుంచి మురుగునీరు వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరిగి మెమోరాండంలు ఇచ్చి మురుగునీరు నివారించి పంటలను రక్షించాలని వేడుకున్నారు. అయినా నియంత్రించాల్సిన అధికారులే నిర్లక్ష్య ధోరణితో రైతులను చిన్నచూపు చూస్తూ ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లోకి ఏకంగా నాలుగు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి మురుగునీటిని పంపిస్తున్నారు. నివారించాల్సిన అధికారులే ఇలా వ్యవహరిస్తే మా గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కింద వరి సాగు చేసే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి ప్రాతూరు రోడ్డు వద్ద జాతీయ రహదారి నుంచి సర్వీస్‌రోడ్డు మధ్య ఉన్న మురుగునీటి కాలువ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో వాటిని తొలగించాల్సిన అధికారులు వారి పని సులువు చేసుకోవడానికి కాలువలోకి మురుగునీరు వదులుతున్నారని, వెంటనే మురుగునీటిని నివారించి ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ ద్వారా నీరు వదలాలని రైతులు కోరుతున్నారు.

రాజధాని పేరుతో లక్షల ఎకరాలు తీసుకోవడం దుర్మార్గం

42వ రోజు రిలే దీక్షలో ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరావు



రిలే దీక్షలో ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు

నిడుముక్కల(తాడికొండ): రాజధాని పేరుతో లక్షల ఎకరాల భూములు తీసుకోవడం దుర్మార్గమని ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. రెండో విడత భూ సమీకరణకు తాము వ్యతిరేకమని కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ ఆగడాలపై తమ పోరాటం అన్నారు. రాజధాని శంకుస్థాపనకు విచ్చేసిన ప్రధాని మోదీ ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. రాజధానిపై పార్లమెంటులో చట్టం చేసి ఈ ప్రాంత రైతులకు తగిన న్యాయం చేయాలన్నారు. భూ సమీకరణ చేయాలనుకుంటే ప్రతి రైతుకు రిటర్నబుల్ ప్లాట్లతో సంబంధం లేకుండా భూమి ఇచ్చిన వెంటనే రూ.కోటి అందజేయడంతో పాటు ప్రతి నెలా వారి కుటుంబాలను పోషించుకునేందుకు రూ.10 వేలు పింఛన్ రూపంలో అందించాలన్నారు. ఈ ప్రాంత వాసిగా రైతులు, రైతు కూలీల సంక్షేమానికి కట్టుబడి తాను గత 42 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నానని, ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రభుత్వం రెండో విడత సమీకరణపై నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్‌పర్సన్‌ల నియామకం

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో పలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్)కు పాలక వర్గాలను నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళగిరి చైర్‌పర్సన్‌గా గాదె పిచ్చిరెడ్డి, సభ్యులుగా వాసా వేణు కుమార్, అందె శివశంకరరావు నియామకమయ్యారు. నూతక్కి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వల్లూరు వెంకటేశ్వరరావు, సభ్యులుగా ఈమని రామమోహనరెడ్డి, ఎం.కోటేశ్వరరావు, పెనుమాక చైర్‌పర్సన్‌గా కళ్ళం శివగోవింద రెడ్డి, సభ్యులుగా సాంబశివరావు, రమ, యర్రబాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బత్తినేని అంజయ్య, సభ్యులుగా శ్రీనివాసరావు, శివశంకరరావు, కురగల్లు చైర్‌పర్సన్‌గా శీలం గోపీనాథ్, సభ్యులుగా జి.కృష్ణారావు, జి.కోటేశ్వరరావు, తాడేపల్లి రూరల్ ఇప్పటం చైర్‌పర్సన్‌గా పోకల బాపయ్య, సభ్యులుగా శ్రీరాములు, సంజీవరెడ్డిలను నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

అబద్ధాలు, మోసాలే బాబు ష్యూరిటీలు



మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



హాజరైన ప్రజలు

పెదవడ్లపూడి(మంగళగిరి): చంద్రబాబు చరిత్ర అంతా అబద్ధాలు, మోసాలేనని.. అవే బాబు ష్యూరిటీలని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెద వడ్లపూడిలో పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకట కృష్ణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేమారెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని కూటమి ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకుంటుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి.. అవి వారి ఆలోచనల నుంచి పుట్టాయని అబద్ధాలు చెబుతారన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు మాటలు విని నవ్వుకుంటున్నారన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఇస్తామని చెప్పిన హామీలు ఇవ్వకుండా ఎంత మోసం చేసిందో వివరించారు. అనంతర బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార విభాగ సభ్యుడు ఈపూరి ఆదామ్, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు అగస్టీన్, మంగళగిరి నియోజకవర్గ విభాగ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొండమడుగుల గోపిరెడ్డి, మండల ఎస్టీ విభాగం అధ్యక్షుడు దుర్గానాయక్, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు పంతగాని రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుర్రం భరత్, ఉపాధ్యక్షుడు షేక్ బాబావలి, ప్రధాన కార్యదర్శులు మహబూబ్ సుభాని, వ్యామల నర్సారెడ్డి, పెన్నపాటి కిరణ్, కార్యదర్శి మణికంఠనాయక్, కోశాధికారి రాఘవేంద్రరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నమ్మి ఓట్లేసిన జనాలను నట్టేట ముంచిన బాబు

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టడం ఖాయం
- రాజధాని పేరుతో రైతులను తరిమేసి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్రలు
- వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



క్యూ ఆర్ కోడ్ ప్రతులను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు

రావెల(తాడికొండ): ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టిన చంద్రబాబును నమ్మి ఓట్లేసిన జనాలను నట్టేట ముంచాడని, ఆయనకు రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్‌బాబు) అన్నారు. ఆదివారం తాడికొండ మండలం రావెల గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నమ్మిన వారిని ముంచడం మొదటి నుంచి చంద్రబాబు నైజమని, పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచి ప్రజాస్వామ్యం ఖూనీ చేసి గద్దెనెక్కిన చంద్రబాబు తన వైఖరి ఇప్పటికీ ఎప్పటికీ మార్చుకోడనేందుకు జరుగుతున్న పాలనే నిదర్శనమన్నారు. కూటమి పేరుతో గారడీ చేసి గద్దెనెక్కిన బాబు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులెత్తేసి రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, కార్పొరేట్ మాఫియాకు తెరలేపాడని మండిపడ్డారు. 33 వేల ఎకరాల్లో ప్రపంచం తలదన్నే క్యాపిటల్ సిటీ నిర్మిస్తానని చెప్పిన బాబు మాట తప్పి గతంలో భూములిచ్చిన రైతులకు కనీస న్యాయం చేయకుండా మళ్లీ లక్షల ఎకరాల సమీకరణ పేరుతో ముందుకు రావడం దేనికి నిదర్శనమో చెప్పాలన్నారు. పరిశ్రమల పేరుతో రైతన్నల నోట్లో దుమ్ముకొట్టి వారిని తరిమేసి కార్పొరేట్ల రాజధాని చేసేందుకు బాబు చేస్తున్న ఆగడాలు ఈ ప్రాంత ప్రజలు అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల్లో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీని కనుమరుగు చేయాలనే దురుద్దేశంతో బాబు ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, బెదిరించినా ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి ఆదరణ ఉందని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో ప్రజల నుంచి వస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, కూటమి ఇకనైనా ప్రజా రంజక పాలన, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే తగిన శాస్తి తప్పదన్నారు. అనంతరం బాబు ఇచ్చిన హామీల క్యూఆర్ కోడ్ బ్రోచర్‌ను ప్రజలకు అందజేసి దానిని స్కాన్ చేసి ఎన్నికల ముందు బాబు ఇచ్చిన హామీలు.. వాటిలో నెరవేర్చాడో ప్రజలే చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముప్పాళ్ళ మనోహర్, మండల ఉపాధ్యక్షుడు నల్లిబోయిన శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు సాంబిరెడ్డి, మండల యువజన, మైనార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు షేక్ అజీస్, బాబావలి, దమ్మాటి మోహనరావు, గ్రామ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి, షేక్ సలీమ్, రత్తయ్య, ఇసుకపల్లి రమేష్, పులి రమేష్, మాజీ యార్డు డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ముఖ్య నాయకులు తాళ్ళ అంజిరెడ్డి, పెద్దశేషురెడ్డి, చిన్న శేషురెడ్డి, మురళీధర్ రెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం

ఫిరంగిపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరచి పేద ప్రజలను వంచించిందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) అన్నారు. మండలంలోని రేపూడి, అమీనాబాద్, వేములూరిపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవజ్రబాబు మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న దాఖలాలు లేవన్నారు. బూటకపు మాటలు చెప్పి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలను పట్టించుకోవడం లేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏ ఒక్కరికి న్యాయం జరిగిన పరిస్థితి లేదన్నారు. అన్నదాత సుఖీభవలో కోతలు విధించారన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పేదవానికి సంక్షేమ పథకం అందేలా చేశాడన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే మరలా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సయ్యద్ హబీబుల్లా, చిట్టా అంజిరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, షేక్.మస్తాన్‌వలి, ఎం.రాయప్ప, పెరికల చిన్న, బద్దూరి శ్రీనివాసరెడ్డి, సయ్యద్ సైదులు, వై.హేమలతారెడ్డి, సాల్మన్, ఎస్.నాగరాజు, కె.ప్రవీణ్‌రెడ్డి, షేక్ ఇస్మాయిల్, గాంధీబుడే, డి.వెంకట్రావు, షేక్ అమానుల్లా, వి.పిచ్చిరెడ్డి, మోరంరెడ్డి, పి.వెంకటరామిరెడ్డి, కమలా రెడ్డి, డి.నరేంద్రకుమార్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిలోని అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ సి, డి బ్లాక్‌లలో బాలబాలికలకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తమకు నచ్చిన రంగాలను ఎంచుకుని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయడానికి వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, అమరావతి ఐకాన్ ఓనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అలహరి శివ సతీష్‌కుమార్, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు జీఎస్ఆర్ మోహనరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి జెట్టి శ్రావణి, ట్రైనర్ చంద్ర ఓబులారెడ్డి, విజయ, క్షితిజ, మనోహర్ రెడ్డి, ఫిరోజ్‌ఖాన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● షాక్ కొడుతున్న స్తంభం



కరెంటు షాక్ కొడుతున్న ముగ్గు రోడ్డులోని ఇనుప స్తంభం

తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్డులో ముగ్గురోడ్డు నుంచి తాడేపల్లి ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో ముగ్గు రోడ్డు చర్చి వద్ద 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభం విద్యుత్ సరఫరా అయ్యి షాక్ కొడుతోందని స్థానికులు చెబుతున్నారు. బాగా ఎండగా ఉన్న సమయంలో లైట్‌గా షాక్ కొడుతున్న కరెంటు స్తంభం, చిన్నపాటి చిరుజల్లు పడినా భారీగా కరెంటు ఉత్పత్తి అయి షాక్ కొడుతోందని, ఒక్కోసారి స్తంభం నుంచి నిప్పురవ్వలు కూడా పడుతున్నాయని, ఈ స్తంభం ఇళ్ల మధ్య ఉండటంతో ఈ ప్రాంతంలో చిన్నారులకు ఎప్పుడు షాక్ కొడుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు ఆ ఇనుప స్తంభాన్ని తీసివేసి సిమెంటు స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - తాడేపల్లిరూరల్

కేబుల్ గుంతతో ప్రమాదం!



తెనాలి: ఎయిర్‌టెల్ సంస్థ తెనాలిలో కేబుల్ లైను కోసం తీసిన గుంతలను రోజుల తరబడి అలానే వదిలేస్తున్నారని.. మున్సిపాలిటీ అనుమతితో వివిధ ప్రదేశాల్లో తీసిన గుంతలను పూడ్చివేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు జి.శరత్‌చంద్ర తెలిపారు. ఆదివారం ఈ అంశాన్ని ఆయన మీడియా దృష్టికి తీసుకువచ్చారు. గాంధీచౌక్‌లో లోతైన గుంత తీసి వదిలేసిన ప్రదేశాన్ని చూసి ఆయన మాట్లాడారు. దాదాపు రెండు వారాలకు పైగా ఆ గుంతలను అలానే ఉంచారని.. ట్రాఫిక్ రద్దీ నెలకొని గుంత వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కనీసం అక్కడ హెచ్చరిక బోర్డు లేదా ప్రమాదకరమన్న సంకేతాన్నీ ఉంచకపోవటం మంచిది కాదన్నారు. సత్వరమే గుంతలను పూడ్చేందుకు మున్సిపాలిటీ తగిన చర్యలను చేపట్టాలన్నారు.

250వ రోజుకు చేరిన దీక్షలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 250వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవ చూపించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, నాగేశ్వరరావు, బూరుగ అంకయ్య, వై.సాంబశివరావు, కార్మికులు సూర్య ప్రకాష్, నవనీతమ్మ, కాసిం, రమాదేవి, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

ఎస్ఐ రవీంద్రనాయక్



మంగళగిరి టౌన్: నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని రౌడీ షీటర్లను ఎస్ఐ రవీంద్రనాయక్ హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్రనాయక్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ప్రతి రౌడీ షీటర్‌పై పోలీస్ నిఘా ఉంటుందని, ఘర్షణలు, పంచాయితీలు, సెటిల్‌మెంట్లకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమపై ఆధారపడిన కుటుంబ సభ్యుల కోసమైనా నేర సంస్కృతిని వదిలివేసి ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలు చూసుకోవాలని సూచించారు. రౌడీ హిస్టరీ ఉన్న వారికి సమాజంలో గౌరవ మర్యాదలు ఉండవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ తల్లి కొలుపులు



తెనాలి టౌన్: శ్రావణ ఆదివారం సందర్భంగా స్థానిక రామలింగేశ్వపేట డిపో సెంటర్ వద్ద గల గంగానమ్మ తల్లి కొలుపులను వైభవంగా నిర్వహించారు. 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుంకర కొండలరావు, మామిడాల సురేష్, అప్పారావు, సుమన్, ఎం.ప్రభాకర్, జగదీష్, రవిశంకర్ పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



తెనాలి టౌన్: రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవసేవా ఆలయంలో ఆదివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సేవా సమితి నిర్వాహకులు అచ్యుత దాసాజీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం వల్ల గర్భస్థ శిశువుకు శక్తివంతమైన భవిష్యత్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. కొన్ని అనుకూల వాఖ్యాలను ఉపయోగించి నాడీ సంబంధిత మార్గం ద్వారా గర్భస్థ శిశువుల్లో గొప్ప ఆలోచనలు కలిగించేలా చేయవచ్చునన్నారు. దీనిలో భాగంగానే గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.